జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :85 శనివారం | 28-11-2026 పేజీలు:8 వెల:రు 3

https://www.epaperjournalistdiary.com/

దీపం వెలిగించాల్సిందే

- తిరుపరంకుండ్రం ఆలయ వివాదంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- తిరుపరంకుండ్రం దీపత్తూన్‌పై కార్తీక దీపం వెలిగించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- ఆలయ ట్రస్టీల బోర్డును సస్పెండ్ చేస్తూ ఇద్దరు రిసీవర్ల నియామకం
- కొండ, ఆలయ భద్రత బాధ్యతలు సీఆర్‌పీఎఫ్‌కు అప్పగింత
- కోర్టు ఆదేశాలు పాటించలేదని తమిళనాడు సీఎస్, డీజీపీలకు ధిక్కరణ నోటీసులు
- రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టిస్తే సహించేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరిక



అమెరికాను ముంచెత్తిన
వరదలు, మంచు తుపాను

- పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ
- థాంక్స్ గివింగ్ వేళ అమెరికాను వణికించిన భారీ తుపాను
- దాదాపు 10 లక్షల ఇళ్లలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- చరిత్రలో తొలిసారి న్యూయార్క్ మేసీస్ పరేడ్ వాయిదా
- వేల సంఖ్యలో విమాన సర్వీసులు ఆలస్యం, రద్దు
- న్యూజెర్సీ, న్యూయార్క్‌లలో ఎమర్జెన్సీ ప్రకటన





మరణం తర్వాత కూడా
తండ్రయ్యే ఛాన్స్..

- భోపాల్ ఎయిమ్స్ వైద్యుల కీలక ముందడుగు!
- మరణించిన వారి నుంచి వీర్యకణాల సేకరణపై కీలక పరిశోధన
- భోపాల్ ఎయిమ్స్ వైద్యులు చేపట్టిన అధ్యయనం సక్సెస్
- మరణానంతర సంతానోత్పత్తికి మార్గం సుగమం
- ఐసీఎంఆర్ సహకారంతో జరిగిన ఈ పరిశోధనకు జాతీయ గుర్తింపు

మానవాళిని కాపాడుకుందాం

ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని రైతులకు సీఎం రేవంత్ పిలుపు

- వాతావరణ మార్పులను కొవిడ్ తరహాలో ఎదుర్కోవాలని సూచన
- రానున్న ఎనిమిది నెలల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం
- నీటి కొరతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా కార్యాచరణ
- త్వరలోనే సుందరమైన మూసీ నదిని చూస్తారని ముఖ్యమంత్రి వెల్లడి
- జలవనరుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటు
- మాదకద్రవ్యాలు, ఆహార కల్తీపై కఠిన చర్యలు
- భావితరాల భవిష్యత్తు కోసమే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- క్లైమేట్ చేంజ్ కాంక్లేవ్ కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఎల్‌నినో ప్రభావంతో రానున్న ఎనిమిది నెలల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశమున్నందున రైతులు ఒక పంటను త్యాగం చేసి నీటి వనరులను కాపాడేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులను కొవిడ్ మహమ్మారిని ఎదుర్కొన్న తరహాలోనే రాజకీయాలకు అతీతంగా సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటి కొరతను అధిగమించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ వాతావరణ సదస్సు సన్నాహక కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దుతామని, చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని తెలిపారు. పర్యావరణ హిత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే తెలంగాణ ప్రపంచ సదస్సును నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు మూడు వేల మందితో ఈగల్ దళం పనిచేస్తోందని, ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. డ్రగ్స్, కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

విద్యుత్ రంగానికి కేంద్రం
సహకరించాలి

- రూ.25,096 కోట్ల విద్యుత్ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం ఇవ్వాలి
- పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి
- పెండింగ్ ప్రాజెక్టుల అమలుకు 2028 మార్చి 31 వరకు గడువు కోరిన భట్టి
- పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి సాయం ఇవ్వాలని ప్రతిపాదన
- అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల్లో పారదర్శకత అవసరమని స్పష్టీకరణ
- పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు ఛార్జీల మినహాయింపు పాడిగించాలని వినతి
- దక్షిణాది ప్రసార వ్యవస్థలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అభ్యర్థన
- వేసవిలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలను అందుబాటులో ఉంచాలని కోరిన ఉప ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ:

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసార, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో తెలంగాణకు సంబంధించిన పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. విద్యుత్ పంపిణీ

-మిగతా 2 లో



బంగాళాఖాతంలో
మరో అల్పపీడనం

- డిసెంబర్ 2న వాయుగుండంగా మారే అవకాశం
- ఉపరితల ఆవర్తనంతో మొదలవుతున్న వాతావరణ మార్పు
- నవంబర్ 30 నాటికి ఆగ్నేయ సముద్రంలో అల్పపీడనం
- డిసెంబర్ 2 నాటికి వాయుగుండంగా మారే సూచనలు
- తమిళనాడు, శ్రీలంక తీరాల వైపు కదిలే ఛాన్స్
- సముద్రంలోనే క్రమంగా బలహీనపడవచ్చని అధికారుల అంచనా

కేంద్ర కేబినెట్ సంచలన ఆమోదం!

- లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ప్రస్తుతం ఉన్న 543 స్థానాలు దాదాపు 815కు పెరిగే అవకాశం
- దక్షిణాది రాష్ట్రాల దామాషా నిష్పత్తి తగ్గకుండా సమన్యాయం
- నవంబరు 30 నుంచి జరిగే ప్రత్యేక పార్లమెంట్ భేటీలో బిల్లు ప్రవేశం
- కేంద్రం వ్యూహాన్ని అడ్డుకునేందుకు శనివారం ఇండియా కూటమి భేటీ

లోక్‌సభ స్థానాలు 815కు పెంపు.. 2051 దాకా ఫ్రీజ్!:



డ్రగ్స్ మహమ్మారిని పారదోలుదాం

నషా ముక్త్ భారత్ యాత్రకు హీరో నాగార్జున మద్దతు

- ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- అమీర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు సాగిన యాత్ర
- బోయపాటి, సాయికుమార్, శివారెడ్డి హాజరు
- డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున
- యువత, విద్యార్థులు పాల్గొనడం సంతోషకరం

డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ప్రముఖ సినీ నటుడు నాగార్జున పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వ ప్రయత్నాలకు ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ యాత్రలో భాగంగా శుక్రవారం అమీర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు సాగిన పాదయాత్రలో నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సమాజంలో అవగాహన కల్పిస్తామని పాల్గొన్నవారితో ప్రతిజ్ఞ చేయించారు. దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, నటులు సాయికుమార్, శివారెడ్డి తదితరులు కూడా యాత్రలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం సంతోషకరమని పేర్కొన్న నాగార్జున, యువత భవిష్యత్తును కాపాడేందుకు కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సైతం డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.





నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి:

- పోలీసులకు అభిజిత్ దీప్కే సవాల్
- పోలీసుల లుకౌట్ నోటీసులపై బహిరంగంగా స్పందించిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే
- రెండుసార్లు జైలుకు వెళ్లానని, జైలంటే భయం లేదని వ్యాఖ్య
- కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ
- దేశంలోని వ్యవస్థలను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుందని విమర్శ
- నాగ్‌పూర్ నిరసన సభలో పోలీసులకు అరెస్ట్ సవాల్ విసిరిన వైనం
- కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ



పార్టీలో పంచాయితీలను
పరిష్కరిద్దాం

- డిసెంబర్‌లోగా నామినేటెడ్ పదవుల భర్తీకి సందీప్ సూచన
- అంతర్గత విభేదాలు, అసంతృప్తులను చక్కదిద్దాలని పీసీసీ అధ్యక్షుడికి ఆదేశం
- పార్టీ శ్రేణులంతా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ
- గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్‌తో కాంగ్రెస్ ఇన్‌చార్జి సమావేశం

హైదరాబాద్:

కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, అసంతృప్తులకు పరిష్కారం చూపాలని, డిసెంబర్‌లోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బి.ఎం. సందీప్ సూచించారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్ గౌడ్‌తో శుక్రవారం గాంధీభవన్‌లో సమావేశమైన ఆయన పార్టీ సంస్థాగత వ్యవహారాలపై చర్చించారు. పార్టీ శ్రేణులంతా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ

-మిగతా 2 లో

విద్యుత్ రంగానికి కేంద్రం సహకరించాలి

(మొదటి తరువాయి)

నష్టాలను తగ్గించడం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, వ్యవసాయ ఫీడర్ల సౌరీకరణ, విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్రం చర్యలు చేపడుతోందని వివరించారు. పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం కింద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ, నష్టాల తగ్గింపునకు సంబంధించి రూ.25,096 కోట్ల విలువైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను ఈ ఏడాది మే 27న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించినట్లు భట్టి తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద తెలంగాణకు కేవలం రూ.72 కోట్ల బడ్జెట్ సహాయం మాత్రమే అందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నివేదికలకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలని, పనుల అమలుకు 2028 మార్చి 31 వరకు గడువు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. టీజీజెన్‌కో చేపట్టనున్న కట్టూరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ నిల్వ సామర్థ్యం పెరిగితే పునరుత్పాదక విద్యుత్ వినియోగానికి మరింత అవకాశం ఏర్పడుతుందని వివరించారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల్లో చోటుచేసుకుంటున్న భారీ హెచ్చుతగ్గులు రాష్ట్రాల ఆర్థిక ప్రణాళికలపై ప్రభావం చూపుతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణకు 5,801 మెగావాట్ల నెట్‌వర్క్ యాక్సిస్‌లో ఎలాంటి మార్పు లేకున్నా 2025 అక్టోబర్‌లో రూ.195 కోట్లు, నవంబర్‌లో రూ.145 కోట్ల ఛార్జీలు విధించారని తెలిపారు. రాష్ట్రాల వారీగా ఛార్జీల వివరాలను ప్రతి నెలా వెల్లడించాలని, మెగావాట్‌కు వార్షిక ప్రాతిపదికన ఛార్జీలు నిర్ణయించి ఏడాదికి ఒకసారి సర్దుబాటు చేసే విధానం అమలు చేయాలని కోరారు.

మరణం తర్వాత కూడా తండ్రయ్యే ఛాన్స్..



న్యూఢిల్లి
వైద్యశాస్త్రంలో ఓ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు భారత వైద్యులు. మరణించిన వ్యక్తి నుంచి కూడా సంతానాన్ని పొందే అవకాశాలపై జరుపుతున్న పరిశోధనల్లో కీలక ముందడుగు పడింది. భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వైద్యులు చనిపోయిన వ్యక్తి నుంచి జీవంతో, చలనంలో ఉన్న వీర్యకణాలను విజయవంతంగా సేకరించి సంచలనం సృష్టించారు. భోపాల్ ఎయిమ్స్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ అండ్ లాబొరేటరీ మెడిసిన్ విభాగాలు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని చేపట్టాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధనకు ఆర్థిక సహాయం అందించింది. ఈ అధ్యయనంలో భాగంగా, పరిశోధకులు సుమారు 600 మంది నుంచి 250కి పైగా వీర్య నమూనాలను సేకరించారు. ఇందులో మరణించిన వ్యక్తుల నుంచి సేకరించిన నమూనాలు కూడా ఉన్నాయి. మరణం తర్వాత ఒక వ్యక్తి వీర్యకణాలు ఎంత సమయం వరకు జీవంతో ఉంటాయో శాస్త్రీయంగా నిర్ధారించడం ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశం. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో, మరణించిన వ్యక్తి వారసత్వాన్ని వారి సంతానం రూపంలో కొనసాగించేందుకు మార్గం సుగమమైంది. కేవలం జ్ఞాపకాలే కాకుండా, మరణం తర్వాత కూడా తమ ఆత్మీయుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ఈ అవకాశానికి ఈ పరిశోధన నాంది పలికింది. జాతీయ స్థాయిలో ఈ అధ్యయనానికి గుర్తింపు లభించడం విశేషం.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

బంగాళాఖాతంలో మరో వాతావరణ మార్పు చోటుచేసుకోనుంది. సముద్రంలో కొత్తగా అల్పపీడనం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. దక్షిణ అండమాన్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనమే దీనికి కారణంగా నిలవనుంది. ఈ ఆవర్తన ప్రభావం వల్ల నవంబర్ 30 నాటికి అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతం పరిధిలో అల్పపీడనం రూపుదిద్దుకోనుంది. ఆ తర్వాత ఇది క్రమంగా మరింత శక్తిని పుంజుకోనుంది. డిసెంబర్ 2 నాటికి ఇది వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా పయనించే అవకాశముంది. తమిళనాడు లేదా శ్రీలంక తీరాల వైపు ఇది వెళ్లొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే తీరం దాటకముందే సముద్రంలోనే ఇది శక్తిని కోల్పోయి బలహీనపడే సంకేతాలు కూడా ఉన్నాయని వాతావరణ విశ్లేషణల ద్వారా స్పష్టమవుతోంది.

మానవాళిని కాపాడుకుందాం



హైదరాబాద్:
ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు ఒక పంటను త్యాగం చేసి మానవాళిని కాపాడేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులను కొవిడ్ మహమ్మారిని ఎదుర్కొన్న తరహాలోనే సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఐటీసీ కాకతీయలో నిర్వహించిన 'తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ కర్టెన్‌రైజర్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోందని, వాతావరణ మార్పుల తీవ్రతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. కేవలం రెండు గంటల్లో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైన సందర్భాలు వాతావరణంలో వస్తున్న మార్పులకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అనేక విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మరో రెండేళ్లకు సరిపడా ఆహార ధాన్యాలు ఉన్నప్పటికీ నీటి కొరత ఆందోళన కలిగిస్తోందన్నారు. రాబోయే ఎనిమిది నెలల పాటు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలున్న నేపథ్యంలో కరువును రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రైతులు ఒక పంటను త్యాగం చేస్తే పశుపక్ష్యాదులకు నీటి లభ్యత కల్పించే అవకాశం ఉంటుందని వివరించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మూసీ నది మురికికూపంలా మారిందని, దానిని సుందరమైన నదిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. అభివృద్ధి పనులపై అనేక అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే సుందరమైన మూసీని చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. చెరువుల పునరుద్ధరణ, జలవనరుల పరిరక్షణ కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో డీజిల్ ఆటోలు, ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని 'క్యూర్', 'ప్యూర్', 'రేర్' అనే మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విధానపరమైన జాప్యం లేదని, అనేక నూతన విధానాలను తీసుకొచ్చామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు మూడు వేల మందితో ఈగల్ ఫోర్స్ పనిచేస్తోందని, ఈ సంస్థ పనితీరును కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి:



మహారాష్ట్ర, నవంబర్ 27:
తనపై ముంబై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే బహిరంగంగా స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, నాగ్‌పూర్‌లోని సంవిధాన్ చౌక్‌లోనే ఉన్నానని చెబుతూ పోలీసులకు అరెస్టు సవాల్ విసిరారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. రాజ్యాంగాన్ని కాపాడండి' నిరసన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దీపం వెలిగించాల్సిందే

-తిరుపరంకుంద్రం ఆలయ వివాదంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

తిరుపరంకుంద్రం దీపత్తూన్‌పై కార్తీక దీపం వెలిగించాలని సుప్రీంకోర్టు ఆదేశం

ఆలయ ట్రస్టీల బోర్డును సస్పెండ్ చేస్తూ ఇద్దరు రిసీవర్ల నియామకం

కొండ, ఆలయ భద్రత బాధ్యతలు సీఆర్‌పీఎఫ్‌కు అప్పగింత

కోర్టు ఆదేశాలు పాటించలేదని తమిళనాడు సీఎస్, డీజీపీలకు ధిక్కరణ నోటీసులు

రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టిస్తే సహించేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరిక



న్యూఢిల్లి
తిరుపరంకుంద్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపరంకుంద్రం కొండపై ఉన్న పురాతన దీపత్తూన్ స్తంభంపైనే శనివారం సంప్రదాయబద్ధంగా కార్తీక దీపాన్ని వెలిగించాలని ఆదేశించింది. ఉచ్చిపిళ్లైయార్ మండపం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జ్యోతితోనే ఈ దీపాన్ని వెలిగించాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ ట్రస్టీల బోర్డును సుప్రీంకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. ఆలయ పరిపాలన, నిర్వహణ బాధ్యతలను సజావుగా నడిపించేందుకు మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్‌లను రిసీవర్లుగా నియమించింది. అంతేకాకుండా, ఆలయం మరియు కొండ పరిసర ప్రాంతాల భద్రతను కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలకు (సీఆర్‌పీఎఫ్) అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీపత్తూన్‌పై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ నవంబర్ 20న ఇచ్చిన మునుపటి ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఆదేశాలను ఉల్లంఘించి, దీపత్తూన్‌పై కాకుండా కేవలం ఉచ్చి పిళ్లైయార్ ఆలయం సమీపంలోని దీప మండపం వద్దే దీపం వెలిగించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడాన్ని ఉపేక్షించబోమని, ఇలాంటి వైఖరిని ఉక్కుపాదంతో అణచివేయాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మధురై జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది. తిరుపరంకుంద్రం కొండపై కార్తీక దీపాన్ని ఏ ప్రదేశంలో వెలిగించాలనే అంశంపై ఆలయ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ఈ కీలక తీర్పును వెలువరించింది.

అమెరికాను ముంచెత్తిన వరదలు, మంచు తుపాను



న్యూఢిల్లి
అమెరికాలో అత్యంత ఘనంగా జరుపుకునే 'థాంక్స్ గివింగ్' పండుగ వేళ ప్రకృతి తీవ్ర ప్రకోపం చూపించింది. భారీ వర్షాలు, పెనుగాలులు, ఆకస్మిక వరదలు, దట్టమైన మంచు తుపానులతో దేశంలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా అమెరికా తూర్పు తీర రాష్ట్రాలపై తుపాను ప్రభావం తీవ్రంగా పడింది. ఈ విపత్తు కారణంగా దాదాపు 10 లక్షల ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల అమెరికావ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. 2,200 కంటే ఎక్కువ విమాన సర్వీసులు ఆలస్యంగా నడవగా, 400కి పైగా విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. రోడ్లు, రైలు మార్గాలు సైతం వరద నీటిలో మునిగిపోయాయి. న్యూయార్క్ నగరంలో ఏటా అట్టహాసంగా నిర్వహించే ప్రపంచ ప్రఖ్యాత 'మేసీస్ థాంక్స్ గివింగ్ డే పరేడ్' చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వాయిదా పడింది. వీధుల్లో తిరిగే భారీ బెలూన్లకు బలమైన గాలుల వల్ల ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు ఈ పరేడ్‌ను శనివారానికి వాయిదా వేశారు. ఈ వార్షిక వేడుక ఇలా వాయిదా పడటం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు వరదల తీవ్రత దృష్ట్యా న్యూజెర్సీ, న్యూయార్క్‌లలోని పలు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ విధించారు. న్యూజెర్సీలోని అవలోన్, ఓషన్ సిటీలలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. రోడ్లు జలమయం కావడంతో కార్లలో చిక్కుకుపోయిన అనేకమందిని సహాయక బృందాలు రక్షించాయి. నార్త్ కరోలినా నుంచి దక్షిణ న్యూ ఇంగ్లాండ్ వరకు తీవ్ర ప్రభావం పడగా, చెసాపీక్ బే బ్రిడ్జ్-టన్నెల్, ఎన్‌సీ 12 ప్రధాన రహదారులను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. మేరీల్యాండ్‌లో విద్యుత్ సమస్యల కారణంగా దాదాపు 20 లక్షల మందికి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మిడ్‌వెస్ట్ రాష్ట్రాలైన ఇల్లినాయిస్, మిస్సోరీలలో భారీగా మంచు కురిసింది. మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో 7.3 అంగుళాలు, సెయింట్ జెనెవీవ్‌లో 14 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది. వెంట్జ్‌విల్లేలో ఒక ఐస్ అరేనా పైకప్పు మంచు ధాటికి కుప్పకూలింది. అలాగే, పశ్చిమ తీరంలోని కాలిఫోర్నియాలో భారీ అలలు, కెరటాల తీవ్రతకు తీర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పసిఫికా పీర్ కొంత భాగం సముద్రంలో కూలిపోగా, రైలు పట్టాలు దెబ్బతినడంతో ఆమ్‌ట్రాక్ పసిఫిక్ సర్వ్‌లైనర్ సేవలను నిలిపివేశారు. ఈ విపత్తుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఫ్లోరిడా వరదలకు సంబంధించి ఇప్పటికే డిజాస్టర్ డిక్లరేషన్‌పై సంతకం చేశామని, తూర్పు తీర తుపాను నష్టంపై ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలిస్తామని వెల్లడించారు. తీవ్రమైన గాలులు, రాకాసి అలలు, వరదల కలయికతో లక్షలాది మంది ప్రజల పండుగ ఉత్సాహం నీరుగారిపోయింది.

కేంద్ర కేబినెట్ సంచలన ఆమోదం!



న్యూఢిల్లి
దేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. శుక్రవారం ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ తాజా నిర్ణయం ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్యను ఏకరీతిగా 50 శాతం పెంచనున్నారు. దీంతో ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్య దాదాపు 815 స్థానాలకు చేరనుంది. అంతేకాకుండా, పెరిగిన ఈ స్థానాల సంఖ్యపై రాబోయే 25 ఏళ్ల పాటు.. అంటే 2051 వరకు ఎలాంటి మార్పు లేకుండా 'ఫ్రీజ్' (స్తంభింపజేయడం) విధించనున్నట్లు సమాచారం. ఈ బిల్లు పూర్తి వివిధానాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే అన్ని రాష్ట్రాల ప్రస్తుత దామాషా (ప్రపోర్షనల్ షేర్) ప్రాతినిధ్యం మారకుండా యథాతథంగా కొనసాగించాలని కేంద్రం భావిస్తోంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయి. డీఎంకే వంటి విపక్ష పార్టీలు ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాయి. వీటికి చెక్ పెట్టేందుకే అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే ఫార్ములాను కేంద్రం తెరపైకి తెచ్చింది. తద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గకుండా కాపాడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. నవంబరు 30 నుంచి డిసెంబరు 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. సభలో అత్యంత కీలక అంశాలపై చర్చ జరగనుందని, విపక్షాలు అనవసర వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. గత ఏప్రిల్‌లో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో ఈ బిల్లు వీగిపోయిన సంగతి తెలిసిందే. కేంద్రం తాజా ఎత్తుగడపై విపక్ష శిబిరంలో తీవ్ర చర్చ మొదలైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఈ నిర్ణయంపై మండిపడ్డారు. ఇది 'భాజపా చేసిన అతిపెద్ద తప్పు' అని, ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల లబ్ధి కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకునేందుకు 'ఇండియా' కూటమి ఉమ్మడి వ్యూహం రచిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం ఉదయం 11 గంటలకు విపక్ష పార్టీల నేతల అత్యవసర సమావేశం జరగనుంది.

డ్రగ్స్ మహమ్మారిని పారదోలుదాం

హైదరాబాద్,
: డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ సినీ నటుడు నాగార్జున పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ యాత్ర మూడో రోజు శుక్రవారం కొనసాగింది. అమీర్‌పేట నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఫిల్మ్‌నగర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు నాగార్జున, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, నటులు సాయికుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సినీ ప్రముఖుల భాగస్వామ్యంతో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి మరింత ప్రాధాన్యత లభించింది.
డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ
పాదయాత్రలో పాల్గొన్న నాగార్జున డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించకుండా సమాజంలో అవగాహన కల్పించాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సంకల్పం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని నాగార్జున అన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉండాలని, కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కూడా డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఈ ప్రమాదంపై ప్రజల్లో అవగాహన పెంచడమే నషా ముక్త్ భారత్ యాత్ర ప్రధాన ఉద్దేశమని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు, విద్యార్థులు కలిసి ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. అమీర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కొనసాగుతున్న పాదయాత్రలో వివిధ వర్గాల ప్రజలు పాల్గొంటూ డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. డ్రగ్స్ రహిత సమాజం సాధించాలంటే ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టం చేస్తున్నారు.

పార్టీలో పంచాయితీలను పరిష్కరిద్దాం

(మొదటి తరువాయి)

రూపొందించాలని సూచించారు. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి బహిరంగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రభుత్వానికి జరుగుతున్న నష్టంపైనా ఇరువురు చర్చించినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేయాలని సందీప్ పేర్కొన్నారు. ఇకపై తరచూ గాంధీభవన్‌కు వచ్చి పార్టీలో తలెత్తే విభేదాల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డిసెంబర్‌లోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని, జనవరిలో సంక్రాంతి ముగిసిన వెంటనే జూన్ వరకు పార్టీ శ్రేణులు పల్లెపల్లెలికూ వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. సందీప్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, ఎంపీలు సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, నాగరాజు, రామ్మోహన్‌రెడ్డి, టి. మనోహర్‌రెడ్డి, టి. లక్ష్మారెడ్డి, మురళీనాయక్, నాయిని రాజేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. పెద్దపల్లి జిల్లాలో పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించే బాధ్యతను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శుక్రవారం గాంధీభవన్‌లో సందీప్‌ను కలిసిన అడ్లూరి లక్ష్మణ్‌తో పెద్దపల్లి పంచాయితీపై చర్చించారు. ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం వహించి, సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని సూచించినట్లు సమాచారం. గురువారం కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ జి. వంశీకృష్ణ సందీప్‌ను కలిసి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రోటోకాల్ అంశాలపై ఫిర్యాదు చేశారు. ఎంపీ వర్గానికి, శ్రీధర్‌బాబు వర్గానికి మధ్య విభేదాలు ఉన్నాయని, పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని వంశీకృష్ణ ఆరోపించినట్లు సమాచారం. దీనిపై శ్రీధర్‌బాబు వర్గం స్పందించలేదు. తనకు ఈ వివాదంతో సంబంధం లేదని, ఎంపీ వంశీకృష్ణకు ప్రోటోకాల్ సమస్య ఉన్నది వాస్తవమేనని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నట్లు తెలిసింది. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు అడ్లూరి లక్ష్మణ్ ప్రయత్నించాలని సందీప్ సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక


అసైన్డ్ భూముల పరిరక్షణకు పంచాయతీ పాలకవర్గం ఫిర్యాదు. !

- నర్సప్పగూడలో 1.02 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు వినతి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ):

నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల పరిరక్షణకు గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలకు శ్రీకారం చుట్టింది. గ్రామంలోని సర్వే నంబర్ 651/9/1లో 1.02 గుంటల అసైన్డ్ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ.. నందిగామ తహశీల్దార్‌కు గ్రామ సర్పంచ్ కోడిచర్ల రాజేశ్వరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య తో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గం వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. సదరు భూమి గతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు అసైన్డ్ చేసినట్లు, అనంతరం భూమికి సంబంధించి వివాదాలు, క్రయవిక్రయాల అంశాలు తెరపైకి వచ్చినట్లు





తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిపై ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి పరిరక్షించాలని కోరారు. సర్వే నంబర్‌కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, భూమి హద్దులను నిర్ధారించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే నిబంధనల ప్రకారం భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్ గోవిందు అశోక్ కుమార్, కురుమ సంఘం అధ్యక్షుడు కట్న శ్రీనివాస్, జంగిలి కుమార్, మాజీ ఉప సర్పంచులు కట్న శేఖర్, నిరటి రవీందర్, రాంచందర్,గోవిందు శేఖర్, జెల్ల శంకరయ్య, యోగేష్, బీరప్ప, బాలరాజు, నర్సింహ, అల్లి గోపాల్, సత్యమయ్య, మల్లేష్ ,ఆలూరి సాయిలు తదితరులు పాల్గొన్నారు. అసైన్డ్ భూముల పరిరక్షణలో భాగంగా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి గ్రామ ప్రయోజనాలను కాపాడాలని గ్రామపంచాయతీ పాలకవర్గం కోరింది.

సిద్దాపూర్ డంపింగ్ యార్డుపై మంత్రి శ్రీధర్ బాబు అధికారిక ప్రకటన చేయాలి..!

-జీవో 641 రద్దు చేస్తున్నట్లు బహిరంగ సభలో ప్రకటించాలి

-డంపింగ్ యార్డు రాదు.. రద్దు చేస్తాం అంటున్న అధికారపార్టీ నాయకులు మంత్రితో ప్రకటన చేయించాలి

-జేఏసి కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్ తిరుమలయ్య డిమాండ్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని లింగారెడ్డిగూడలో నిర్వహించే బహిరంగ సభలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు (ఎకో టౌన్)కు సంబంధించిన జీవో 641 రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (గ్రామ జోజా) కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్ తిరుమలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 641ను రద్దు చేయాలని ప్రజలు సుదీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. ప్రజల



ఆందోళనలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారపార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోందన్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే డంపింగ్ యార్డు రానివ్వమని హామీ ఇచ్చిన రెండు రోజులకే జీవో జారీ కావడంతో ప్రజల్లో నాయకుల మాటలపై విశ్వాసం సన్నగిల్లిందని గుర్తుచేశారు. ఈ నెల 7వ తేదీన నందిగామలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఉద్యమకారులు వినతిపత్రం అందజేయగా, డంపింగ్ యార్డు రాదని, మరో ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే 20 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం బాధాకరమన్నారు.

మరోవైపు అధికారపార్టీ నాయకులు తామే మంత్రితో మాట్లాడి డంపింగ్ యార్డు రాకుండా అడ్డుకున్నామని చెబుతూ, ఇంకా రానివ్వమని ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యమకారులను అవహేళన చేస్తూ మాట్లాడటం సరికాదని, నిజంగా ప్రజల పక్షాన నిలబడాలనే చిత్తశుద్ధి ఉంటే ఈరోజు షాద్‌నగర్‌కు వస్తున్న మంత్రి శ్రీధర్ బాబుతో బహిరంగ సభ వేదికగా జీవో 641 రద్దుపై అధికారిక ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సిద్దాపూర్ గ్రామంలో అభివృద్ధి పేరుతో కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటును కూడా విరమించుకోవాలని, ఆ భూములను ప్రజల ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించినట్లుగానే డిసెంబర్ 6వ తేదీలోపు జీవో 641 రద్దుపై ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేయాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో ఆ తర్వాత ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జరిగే పరిణామాలకు స్థానిక ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి ఉంటుందని పినపాక ప్రభాకర్, తిరుమలయ్య పేర్కొన్నారు.

షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు.. ప్రజా పోరాటానికి సిద్ధం

-నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే రాష్ట్రస్థాయి ఉద్యమం

-పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరిక

-2020 నుంచి ఇప్పటివరకు 65 మంది మృతి.. 102 మందికి గాయాలు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

షాద్‌నగర్ పట్టణ చౌరస్తా వద్ద వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా పాలకులు స్పందించకపోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చౌరస్తా విస్తరణ కోసం ఆర్.ఎన్. రాజు చేపడుతున్న ఉద్యమానికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైతే ప్రత్యక్ష ప్రజా పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. షాద్‌నగర్ చౌరస్తా వద్ద ఇటీవల మరో ప్రాణం రోడ్డు ప్రమాదంలో బలైన నేపథ్యంలో చౌరస్తా విస్తరణ ఉద్యమం మరింత ఉధృతమైంది. 2020 నుంచి ఇప్పటివరకు చౌరస్తా వద్ద జరిగిన ప్రమాదాల్లో 65 మంది మృత్యువాత పడగా, 102 మంది గాయపడినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చౌరస్తా విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆర్.ఎన్. రాజు చేస్తున్న ఉద్యమానికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య



మాట్లాడుతూ.. ఇకపై షాద్‌నగర్ చౌరస్తా వద్ద ఒక్క ప్రాణం కూడా రోడ్డు ప్రమాదానికి బలికాకూడదని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత ఏడాది కాలంగా ఒక యువకుడు ప్రజల ప్రాణాల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తుంటే, ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా ఆ ఉద్యమానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆర్.ఎన్. రాజు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం ఆయన చేస్తున్న కృషికి పాదాభివందనం చేస్తున్నామని విష్ణువర్ధన్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. చౌరస్తా విస్తరణ అనేది ఏ ఒక్క వ్యక్తికో, రాజకీయ పార్టీకో సంబంధించిన సమస్య కాదని, ఇది పట్టణ ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశమని నాయకులు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, యువత పార్టీలకతీతంగా ఏకమై ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి చౌరస్తా విస్తరణ పనులు ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం నెల రోజుల్లోగా చౌరస్తా విస్తరణపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి పనులు ప్రారంభించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి పట్టణ ప్రజలందరినీ భాగస్వాములుగా చేస్తూ చౌరస్తా విస్తరణ సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అందె బాబయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ సారి, మున్సిపల్ కౌన్సిలర్ పేట అశోక్, మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, హాజీపల్లి ఉపసర్పంచ్ గంగాధర్, నాగులపల్లి ఉపసర్పంచ్ సుమన్ గౌడ్, షాద్‌నగర్ దేవాదాయ శాఖ కన్వీనర్ నరసింహ యాదవ్, కొత్తూర్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంగేం శివకుమార్, మురళి, సుధాకర్ అప్ప, మిద్దె గణేష్, అల్లం అనిల్ కుమార్ గౌడ్, భాస్కర్, నర్సింహ, నరేందర్ రెడ్డి, గాలి శివ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని శివ మారుతి గీత అయ్యప్ప స్వామి దేవాలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి మిత్రా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువై ఉన్న గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గణనాథుడిని ప్రార్థించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి మిత్రా యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో మూడవ రోజు కొనసాగిన అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమం.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో మూడవ(3) రోజు భిక్ష కార్యక్రమాన్ని షాద్‌నగర్ పట్టణానికి చెందిన గడ్డం మదన్ గోపాల్ -- పద్మావతి దంపతుల మనవడు గడ్డం రుత్విక్ కార్తీక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు గడ్డం అభినవ్ -- స్వప్న దంపతులతో పాటు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు వన్నాడ ప్రకాష్ గౌడ్, గునెల్లి రమేష్ స్వామి, మల్చలం మురళీ స్వామి, బాబు స్వామి, శ్రీశైలం, పినపాక ప్రభాకర్, బాల్‌రెడ్డి, పోలె రాజేశ్వర్ స్వామి, మాచారం రవీందర్ గౌడ్ స్వామి, ప్యాట విశ్వేశ్ స్వామి, అభిలాష్ గౌడ్ స్వామి, వినోద్ స్వామి, మధుకర్ రెడ్డి స్వామి, పోలె మణికంట స్వామి, కౌన్సిలర్ బచాలి నరేష్ స్వామి తదితరులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు.

పారదర్శకతతో కూడిన వ్యాపారంతో రియల్ ఎస్టేట్ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

షాద్‌నగర్ నియోజకవర్గ రియల్ ఎస్టేట్ యూనియన్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శివాజీ, ఉపాధ్యక్షులు శంకర్,ట్రెజరి చాకలి మురులి,జనరల్ సెక్రెటరీ సతీష్,జాయింట్ సెక్రెటరీ షబ్బీర్ లాల,మరియు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతో భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు నిబద్ధతతో, పారదర్శకంగా పనిచేస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కొనుగోలుదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో షాద్‌నగర్ నియోజకవర్గ రియల్ ఎస్టేట్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లేమామిడిలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

- శంకర నేత్రాలయ సహకారంతో వైద్య పరీక్షలు
- శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఎన్నారై గోగు వెంకటనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శంకర నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గ్రామ సర్పంచ్ సులోచన శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఎన్నారై గోగు వెంకటనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్ రావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కల లక్ష్మీనారాయణ గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, దేవేందర్ యాదవ్, రాజు, గోగు వెంకటనారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, నవీన్ కుమార్, అంజిరెడ్డి, యాదగిరి రావు, శ్రీశైలం, జమాల్ ఖాన్, లక్ష్మీనారాయణ, ప్రేమ్ కుమార్ గౌడ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్- 2026-27 కార్యక్రమం ముగింపు వేడుకలలో పాల్గొన్న గాంధీ



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : చందానగర్ డివిజన్ పరిధిలోని పిజిఆర్ స్టేడియంలో జరిగిన శేరిలింగంపల్లి మండల బడ్జెట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్- 2026-27 కార్యక్రమం ముగింపు వేడుకలలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని , విజేతలకు బహుమతులు అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బడ్జెట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్- 2026-27 కార్యక్రమం ను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగినది అని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తి నీ ప్రదర్శించడం జరిగినది అని, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యం అని , క్రీడల ద్వారా శారీరక శ్రమ తో పాటు మానసిక ఉల్లాసం కలుగునని, విద్యార్థులు ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఏర్పరుచుకొని ఆ దిశగా అడుగులు వేయాలని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చక్కటి క్రమశిక్షణ ,ప్రణాళిక, ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలియచేశారు.పీజీఆర్ స్టేడియం ను 20 కోట్ల రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నాం అని, క్రీడాకారులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, ఒక చక్కటి వేదిక అని , క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు చదువుతూ పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఎంచుకున్న క్రీడా రంగాలలో మంచి భవిష్యత్తు నిర్మించుకొని జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి మన ప్రాంత ఖ్యాతిని నలువైపుల చాటాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నరేందర్ బల్ల, శేరిలింగంపల్లి మండల బడ్జెట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ ప్రెసిడెంట్ నిజాం అలీ ఖాన్, సెక్రటరీ వెంకటేష్, ట్రెజరర్ హిమ బిందు,స్టేట్ ప్రెసిడెంట్ భీష్మ రెడ్డి, వాసుదేవ రావు, అస్లాం,కిరణ్, శ్రీనివాస్ శంకర్,రాజు, భారత్ కుమార్,ఆచార్య మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


తొండపల్లిలో మైనార్టీ మహిళకు ఉచిత కుట్టు మిషన్ పంపిణీ



జర్నలిస్ట్ డైరీ పరిగి నవంబర్ 27
తొండపల్లి గ్రామంలో మైనార్టీ సంక్షేమ పథకం కింద జబీనా బేగం అనే మహిళకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమార్, సందీప్ చేతుల మీదుగా ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని అందిస్తోందని నాయకులు పేర్కొన్నారు. కుట్టు మిషన్ అందించిన నాయకులకు, ప్రభుత్వానికి లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై మంత్రి శ్రీధర్‌బాబు కీలక హామీ

-అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు"
-టీడబ్ల్యూజేఎఫ్ వినతికి సానుకూల స్పందన..
-జర్నలిస్టులకు న్యాయం చేస్తామని భరోసా
-హెల్త్ కార్డులు, ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని వినతి
-షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల వినతి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీపికబురు అందించారు. ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రత్యేక విధానాన్ని తీసుకువస్తోందని, దాని ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై మంత్రి ఇచ్చిన ఈ హామీతో ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశలు చిగురించాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం రూ.29.70 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) షాద్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ప్రతినిధులు మంత్రిని, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని షాద్‌నగర్ పట్టణం, ఫరూక్‌నగర్, కేశంపేట, నందిగామ, కొత్తూర్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సొంత ఇంటి కలను ప్రజా ప్రభుత్వంలోనైనా సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలతోపాటు జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ ఖాజా పాషా (కేపీ) మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ నిరంతరం ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టుల జీవితాల్లో భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, నియోజకవర్గంలోని ఏడు మండలాల జర్నలిస్టులకు సమానంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు హామీతో జర్నలిస్టుల్లో కొత్త ఆశలు

టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు అందించిన వినతిపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తోందని, ఆ విధానం ద్వారా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. సొసైటీ పరంగా ఇచ్చినప్పటికీ కూడా కోర్టులో నిలవడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఇచ్చిన ఈ భరోసా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారంపై ఆశలు రేకెత్తించింది. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వారికి ఇళ్ల స్థలాలు కల్పించే అంశంపై త్వరలో కార్యాచరణ రూపొందించి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల చిరకాల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, సానుకూల హామీ సాధించడంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య షాద్‌నగర్ డివిజన్ కమిటీ చొరవ ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు జె. రాఘవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె. నరేష్, ఉర్దూ పాత్రికేయులు మన్సూర్ అలీ ఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు మొయినోద్దీన్‌తో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే యువతకు బంగారు భవిష్యత్తు

-రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
-పట్టుబట్టి పనిచేసే నాయకుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని ప్రశంస
-నియోజకవర్గ అభివృద్ధికి రూ. 30 కోట్లు మంజూరు చేయించడంలో ఆయన కృషి అభినందనీయం
-పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ఆధునిక టెక్నాలజీతో తీర్చిదిద్దుతున్నామని వెల్లడి
-లింగారెడ్డిగూడెం 29.70 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల భవనానికి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) : కేవలం డిగ్రీలు, సర్టిఫికెట్లు ఉంటేనే ఉద్యోగాలు రావని, సాంకేతిక పరిజ్ఞానం మరియు నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని లింగారెడ్డిగూడెంలో రూ. 29.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషిపై ప్రశంసల జల్లు

నియోజకవర్గ అభివృద్ధి కోసం పట్టుబట్టి పనిచేసే నాయకుడు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 30 కోట్ల నిధులు మంజూరు చేయించడంలోనూ, తనను ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రత్యేకంగా రప్పించడంలోనూ శంకర్ ఎంతో చొరవ చూపారని అభినందించారు. “ఆయన పట్టుబట్టి పనిచేసే తత్వమే నేడు ఆయనను ఎమ్మెల్యేగా నిలబెట్టింది. నిత్యం ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచిస్తూ.. తన కార్యాలయానికి వచ్చినా, ఫోన్ చేసినా పనులు పూర్తయ్యే వరకు వదిలిపెట్టరు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి, నేడు పదిమందికి మేలు చేయాలనే తపనతో ముందుకు సాగుతున్నారు” అని మంత్రి ప్రశంసించారు.

సాంకేతిక విద్య, ఆధునీకరణకు పెద్దపీట

రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏ టి సి), పాలిటెక్నిక్ కళాశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక కోర్సులను అందిస్తున్నామని వివరించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ (ప్రాక్టికల్ ట్రైనింగ్) కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, తద్వారా కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలిటెక్నిక్ తర్వాత ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశం యథాతథంగా కొనసాగుతుందని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మవద్దని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

సంక్షేమ పథకాల అమలు

గత పదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీసం యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను కూడా నియమించలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహజ్యోతి), రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ, అర్హులకు పెన్షన్ల మంజూరు వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ ఎన్.ఆర్. సరిత, డీసీపీ శిరీష, తహసీల్దార్ నాగయ్య, పాలిటెక్నిక్ జాయింట్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ రాకేష్, లింగారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ ఎం.సి. ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీలు వెంకటరాంరెడ్డి, విశాల శ్రవణ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రఘు నాయక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, కోగూరి పురుషోత్తంరెడ్డి, ఎల్లారం శేఖర్‌రెడ్డి, జాకారం చంద్రశేఖర్, అన్నగళ్ల రమేష్, కుమారస్వామి గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు చల్ల శ్రీకాంత్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, అనిత, జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, జగదీష్ అప్పా, జండగూడెం సుదర్శన్ గౌడ్, యువ నాయకులు కేకే కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి, షాద్‌నగర్ పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

బూర్గుల రామకృష్ణారావు కీర్తిని చిరస్థాయిగా నిలిపేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్

-ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

-బూర్గులలో విద్యాభివృద్ధికి మరో ముందడుగు

-రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

-భూమిపూజ చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్టే డైరీ) :

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని భావించి, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జన్మించిన పవిత్ర గ్రామం బూర్గుల అని, ఆయన కీర్తి ప్రతిష్ఠలను భావితరాలకు అందించాలనే సంకల్పంతోనే నియోజకవర్గానికి మంజూరైన ఏకైక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో గ్రామంలో కళాశాల ఏర్పాటు చేసి దానికి బూర్గుల రామకృష్ణారావు పేరు పెట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం, పారదర్శక బదిలీలు, కొందుర్గు మండలంలో రూ. 250 కోట్లతో సమీకృత పాఠశాల నిర్మాణం వంటి కార్యక్రమాలు విద్యారంగంలో మార్పునకు దోహదపడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలు, పుస్తకాలు అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తూ నాణ్యమైన విద్యను చేరువ చేస్తున్నామని తెలిపారు. విద్య, సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ షాద్‌నగర్ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు పని ఒత్తిడి ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ, తహసీల్దార్, విద్యాశాఖ అధికారులు, డీసీసీ అధ్యక్షురాలు పారిజాత, బూర్గుల రామకృష్ణారావు మనుమడు విజయ్, స్థానిక సర్పంచ్ రాజ్ గోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, షాద్ నగర్ మున్సిపాలి చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, బాల రాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజీ కోసం విద్యార్థుల గర్జన!

-సూర్యాపేటలో వేలాది మంది విద్యార్థులతో జన సేవా సమితి భారీ ర్యాలీ.. పాలకుల నిర్లక్ష్యంపై తగుళ్ల జనార్ధన్ యాదవ్ ఆగ్రహం

-ఓట్ల కోసం బహుజనులు కావాలి.. చదువుల కోసం కాలేజీ ఏర్పాటు చేయరా?

- ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్



సూర్యాపేట,నవంబర్ 27 :జర్నలిస్ట్ డైరీ

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జన సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వేలాది మంది విద్యార్థులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక 60 ఫీట్ల రోడ్డు నుంచి పాత బస్టాండ్‌లోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వరకు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కోసం కనీసం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక పాలకులకు తమ ఆస్తులను కాపాడుకోవడం, రాజకీయంగా ఎదగడంపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థుల భవిష్యత్తుపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన, బహుజనుల ఓట్లు కావాలని కోరే నాయకులు.. అదే వర్గాల పేద బిడ్డలకు నాణ్యమైన ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల కనీస అవసరాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేట్ కళాశాలల్లో చదవలేక, ఇతర జిల్లాలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రైవేట్ విద్యా సంస్థలకు లాభం చేకూరుతోందని విమర్శించారు.సూర్యాపేట ప్రజలకు కావాల్సింది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వ విద్యా సంస్థలని, కానీ పాలకులకు ఆ దిశగా ఆలోచన, చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న పాలకులకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బహుజన, విద్యార్థి లోకం ఏకమై నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులకు డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల ఏర్పాటుపై అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో సూర్యాపేట బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జన సేవా సమితి నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులతో పాటు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి, గిరిజన శక్తి నాయకుడు వెంకటేష్ నాయక్, ఎస్సీ నాయకుడు గాలి వికాస్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరాల సాయి, జన సేవా సమితి నాయకులు ఏర్పుల రవి, పవన్, నక్క గంగరాజు, మంద శివ, ఉమేష్, రాజు, మహేష్, అశోక్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా నమోదులో చండూరు మున్సిపాలిటీ టాప్..!



చండూరు జర్నలిస్ట్ డైరీ నవంబర్ 27

చండూరు.....ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమం ఈనెల 19న ప్రారంభమైంది. చండూరు మున్సిపాలిటీలో 3,971 రేషన్‌కార్డులు ఉండగా గురువారం రాత్రి వరకు 1,961 కార్డులను పూర్తి చేశారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో జరుగుతున్న నమోదును చూస్తే చండూరు మున్సిపాలిటీనే టాప్ పొజిషన్‌లో కొనసాగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో నమోదు పూర్తి కానుంది. కాగ అప్పటి వరకు నమోదు కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది వార్డులలోకి వచ్చి చేపడుతారు. సోమవారం తర్వాత నమోదు మున్సిపాలిటీలోనే చేపడుతారు. కాబట్టి ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్.మల్లేషం తెలిపారు.నమోదును ఎప్పటికప్పుడు చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, కమిషనర్ మల్లేషం,పర్యవేక్షిస్తున్నారు. కాగా సిబ్బంది సైతం నమోదులో చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. వార్డులలో నమోదు తక్కువగా ఉన్న వీధులలోకి వెళ్లి మరి అవగాహన పరుస్తూ నమోదు చేపట్టడం అభినందనీయం. కమిషనర్ మల్లేషం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కూడా చండూరు మున్సిపాలిటీని చాలా సందర్భాలలో జిల్లా, కొన్ని విషయాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి వరసలో నిలుపుతూ వస్తున్నారు. ఇందిరమ్మ జీవిత భీమా పథకంలో రేషన్ కార్డులో ఉండే కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు లేదా ఎలా చనిపోయిన రూ.5లక్షలు ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎల్ఐసీ ద్వారా చెల్లిస్తుంది. మనం చేయాల్సిందల్లా రేషన్‌కార్డులోని కుటుంబ పోషకుడు తన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును తీసుకొని వెళ్లి నమోదు చేసుకోవటమే.

జీరో అవర్ రన్ - ఇంటు ది న్యూ ఇయర్ పోస్టర్ ను ఆవిష్కరించిన ఆరెక పూడి గాంధీ.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 27 (జర్నలిస్ట్ డైరీ) :

గచ్చిబౌలి స్టేడియంలో 31 డిసెంబర్ 2026న ఆడ్‌లైఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జీరో అవర్ రన్ – ఇంటు ది న్యూ ఇయర్ పోస్టర్ ను ఆవిష్కరించిన పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జీరో అవర్ రన్ వెనుక ఉన్న ఉద్దేశం చాలా సులభమైనది మరియు శక్తివంతమైనది – మీ సంవత్సరాన్ని పరుగుతో ముగించండి, మీ నూతన సంవత్సరాన్ని పరుగుతో ప్రారంభించండి.మద్యంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి బదులు, ఫిట్‌నెస్, శక్తి మరియు సానుకూలతతో స్వాగతం పలకాలని ఆడ్‌లైఫ్ ట్రస్ట్ అందరినీ ఆహ్వానిస్తోంది అని, ఇది చక్కటి కార్యక్రమం అని ,యువత కు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియచేశారు.

100% మద్యం లేదు. 100% వినోదం మరియు సంబరాలు.

అందరూ వచ్చి పరుగెత్తవచ్చు. కుటుంబాలన్నీ ఒకే చోట కలిసి పరుగెత్తి, ఆనందించి, పూర్తి వినోదంతో వేడుక జరుపుకోవచ్చు.

ఆరోగ్యకరమైన, మాదకద్రవ్యాలు లేని మరియు మద్యం లేని తెలంగాణ కోసం ప్రతిజ్ఞ చేయడానికి హైదరాబాద్ పౌరులు, రన్నర్లు, కుటుంబాలు, యువత మరియు ఫిట్‌నెస్ ప్రేమికులందరినీ జీరో అవర్ రన్‌లో పాల్గొనాలని ఆడ్‌లైఫ్ ట్రస్ట్ ఆహ్వానిస్తోంది అని ట్రస్టు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అన్నారాజు చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.

కార్యక్రమ వివరాలు:

– కార్యక్రమం: జీరో అవర్ రన్ – ఇంటు ది న్యూ ఇయర్

– తేదీ: 31 డిసెంబర్ 2026

–వేదిక: గచ్చిబౌలి స్టేడియం, హైదరాబాద్

నిర్వాహకులు: ఆడ్‌లైఫ్ ట్రస్ట్

ఈ కార్యక్రమంలో ఆడ్‌లైఫ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అజయ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పోతుల రాజేందర్,కాశీనాథ్ యాదవ్,ఖాజా, యాసిన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన నాయకులు



మునుగోడు నవంబర్ 27 జర్నలిస్ట్ డైరీ

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు, మునుగోడు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగినఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నిరంతరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కొంపల్లి నాయకులు



మునుగోడు: నవంబర్ 27జర్నలిస్ట్ డైరీ


మునుగోడు మండలం, కొంపల్లి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వేదిరె మేఘారెడ్డి, కొంపల్లి గ్రామ సర్పంచ్ నిర్మల దశరథ, మునుగోడు మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు విజేందర్ రెడ్డి, మరియు మండల ఉపాధ్యక్షుడు శంకర్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.అనంతరం కొంపల్లి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, కొంపల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

స్విగ్గీలో 340 ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ:
స్విగ్గీకి చెందిన క్విక్-కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్‌లో 340 ఉద్యోగాలను తగ్గించనున్నట్లు శుక్రవారం రాయిటర్స్ కథనం తెలిపింది. భారత్‌లో బ్లింకిట్, జెప్టో వంటి సంస్థలతో ఇన్‌స్టామార్ట్ పోటీపడుతున్నది.పోటీని తట్టుకునేందుకు స్టోర్లను విస్తరించడం, వేగంగా డెలివరీలు చేయడం, మార్కెట్ వాటాను పెంచుకోవడంపై సంస్థ దృష్టి పెట్టింది. ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఉద్యోగులను తగ్గిస్తున్నట్టు రాయిటర్స్ వెల్లడించింది. ప్రభావితం అయ్యే ఉద్యోగులకు ప్యాకేజీలు అందిస్తున్నట్లు సమాచారం.

కేంద్రమంత్రిపై 3 కోట్ల పరువునష్టం దావా



న్యూఢిల్లీ
సీజేపీ కో కన్వీనర్ ఆశుతోష్ రాంకాకు పాకిస్థాన్ రాజకీయ నాయకులు, ఒక హ్యాండ్లర్ నుంచి నిధులు అందాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చేసిన ఆరోపణలపై ఆ పార్టీ రూ.3 కోట్ల పరువు నష్టం లీగల్ నోటీసు పంపింది.రాంకా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ (ఎల్ఎస్ఈ) విద్యార్థి అని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. లండన్‌లో మెకిన్సే అండ్ కంపెనీలో ఉన్న అత్యున్నత వేతనం కలిగిన ఉద్యోగాన్ని వదిలి ప్రజల కోసం భారత్‌లో పనిచేస్తున్నారని నోటీసుల్లో వెల్లడించారు.

రితబ్రత బెనర్జీకి షాక్.. ప్రతిపక్ష నేత హోదా రద్దు



కోల్‌కతా
తృణమూల్ కాంగ్రెస్ రెబల్ వర్గానికి ఎదురుదెబ్బ తగిలింది. బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ నియామకాన్ని కలకత్తా హైకోర్టు రద్దు చేసింది. దాంతో పాటు ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ ను చీఫ్ విప్‌గా నియమించడాన్ని కూడా జస్టిస్ కృష్ణారావు రద్దు చేశారు.రితబ్రత బెనర్జీ నియామకంపై హైకోర్టులో మమతా బెనర్జీ వర్గం నేత శోభన్‌దేబ్ పిటిషన్ వేయగా.. ధర్మాసనం పునఃపరిశీలించింది. స్పీకర్ నిర్ణయం సరైనది కాదని.. ప్రతిపక్ష నేత అంశంపై 10 రోజుల్లో తాజా ఉత్తర్వులు ఇవ్వాలని స్పీకర్ రథీంద్ర బోస్‌ను కోర్టు ఆదేశించింది.

విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు



చెన్నై:
తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. పెరంబూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం కొట్టివేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. పెరంబూర్‌లో ఆయన గెలుపును సవాల్ చేస్తూ అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్ అనే ఓటరు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ తన నామినేషన్ పత్రాల్లో స్థిరాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. ఈ ఎన్నికల పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతూ విజయ్ న్యాయస్థానంలో ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఆయన అభ్యర్థనను తోసిపుచ్చారు. దీంతో పెరంబూర్ ఎన్నికను సవాల్ చేస్తూ దినేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి న్యాయప్రక్రియ కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాది అరెస్ట్.. ఏకే-47 స్వాధీనం

గాంధీనగర్:
ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదిని గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్ట్ చేసింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైష్-ఎ-మొహమ్మద్ (జేఈఎం)కు చెందిన అతడి నుంచి ఏకే-47 రైఫిల్, తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అస్సాంలోని కరీంగంజ్‌కు చెందిన 22 ఏళ్ల మొహమ్మద్ సహరుల్ ఇస్లాంగా ఆ ఉగ్రవాదిని గుర్తించారు. వడోదరలోని వైమానిక దళ కేంద్రంపై ఒంటరిగా దాడి చేసేందుకు అతడు ప్లాన్ వేసినట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి తెలిపారు. ఆ కేంద్రాన్ని రెక్కీ చేసి, మొబైల్ ఫోన్‌లో ఫొటోలు తీశాడని చెప్పారు. భద్రతా నిఘా నుంచి తప్పించుకునేందుకు ఆ ఉగ్రవాది అస్సాం నుంచి



గుజరాత్‌కు నేరుగా కాకుండా పలు రైళ్లు, బస్సులలో ప్రయాణించి చుట్టూ తిరిగి వచ్చాడని ఆ అధికారి వివరించారు.కాగా, ఉగ్రవాది మొహమ్మద్ సహరుల్ ఇస్లాం గత ఏడాదిగా పాకిస్థాన్‌లోని జైష్ హ్యాండ్లర్లతో చురుకైన సంబంధాలు కలిగి ఉన్నాడని ఏటీఎస్ డీఐజీ తెలిపారు. వడోదరలోని వైమానిక దళ కేంద్రంపై దాడి తర్వాత పాకిస్థాన్‌కు పారిపోవాలని అతడు ప్లాన్ వేసుకున్నాడని చెప్పారు. నిందితుడి నుంచి ఒక ఏకే-47 రైఫిల్, 23 తూటాలు, రెండు ఖాళీ తూటాలు, ఒక జేఈఎం జెండా, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి వివరించారు. అయితే జూలైలో గుజరాత్ ఏటీఎస్ పలు రాష్ట్రాల్లో దాడులు చేసింది. జైష్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులను అరెస్ట్ చేసింది.

ఏడాదిలో 165 టన్నుల బంగారం వెనక్కి తెచ్చిన ఆర్బీఐ.. భారత్ వ్యూహమేంటి?

న్యూఢిల్లీ
విదేశాల్లో భద్రపరిచిన బంగారాన్ని భారత్ వేగంగా స్వదేశానికి తరలిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఏకంగా 165 టన్నుల బంగారాన్ని విదేశీ వాల్ట్‌ల నుంచి వెనక్కి తెచ్చింది. దీంతో మొత్తం బంగారం నిల్వల్లో దేశీయంగా భద్రపరిచే వాటా 65.4 శాతం నుంచి 84 శాతానికి పెరిగింది. ఏడాది క్రితం భారత్‌లో 575.82 టన్నుల బంగారం ఉండగా.. ఇప్పుడు 740.13 టన్నులకు చేరింది.

ఆరు నెలల్లోనే 60 టన్నులు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల్లోనే ఆర్బీఐ విదేశాల్లో ఉన్న 60.08 టన్నుల బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చింది. మార్చి చివరికి దేశీయంగా 680.05 టన్నులుగా ఉన్న నిల్వలు సెప్టెంబర్ చివరికి 740.13 టన్నులకు పెరిగాయి. దీంతో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) వద్ద ఉన్న భారత బంగారం 197.67 టన్నుల నుంచి 140.39 టన్నులకు తగ్గింది. మొత్తం బంగారం నిల్వలు మాత్రం దాదాపు స్థిరంగా 880.18 టన్నుల నుంచి 880.52 టన్నులకు చేరాయి. అంటే కొత్త కొనుగోళ్ల కంటే విదేశాల్లో ఉన్న బంగారాన్ని వెనక్కి తీసుకురావడమే ప్రధానంగా కనిపిస్తోంది.



విదేశాల్లో ఎందుకు నిల్వ చేస్తారు?

1990ల్లో విదేశీ మారక సంక్షోభ సమయంలో భారత్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టి 405 మిలియన్ డాలర్ల రుణం తీసుకుంది. 1991 నవంబర్‌లోనే రుణం తిరిగి చెల్లించినప్పటికీ.. తాకట్టు పెట్టిన బంగారాన్ని భారత్‌కు తరలించకుండా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్దే ఉంచింది. ఇలా విదేశాల్లో బంగారం నిల్వలు ఉంటే అంతర్జాతీయ చెల్లింపులు, వాణిజ్యం, స్వాప్ లావాదేవీలకు సులభంగా ఉపయోగించుకోవచ్చు. లండన్ ప్రపంచ బంగారం వ్యాపారానికి ప్రధాన కేంద్రం కావడంతో అనేక దేశాల కేంద్ర బ్యాంకులు అక్కడ నిల్వలను ఉంచుతాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద సుమారు 4 లక్షల బంగారు ఇటుకలు ఉన్నట్లు సమాచారం.

బంగారాన్ని భారత్ ఎందుకు తెస్తోంది?

ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పశ్చిమ దేశాలు రష్యా విదేశీ ఆస్తులను స్తంభింపజేశాయి. ఈ పరిణామం విదేశాల్లో ఉన్న జాతీయ ఆస్తుల భద్రతపై ఇతర దేశాల్లోనూ ఆందోళనలు రేకెత్తించింది. దీంతో విదేశీ వాల్ట్‌లపై ఆధారపడటాన్ని తగ్గించి, బంగారంపై దేశీయంగా ప్రత్యక్ష నియంత్రణ పెంచుకోవడంపై భారత్ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. విదేశాల్లో నిల్వ చేసిన బంగారాన్ని స్వదేశానికి తరలించడం వల్ల అవసరమైనప్పుడు వినియోగించుకోవడం సులభం కావడంతో పాటు, అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో నిల్వల నిర్వహణలో రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. 2023లో భారత్ వద్ద 794.63 టన్నుల బంగారం ఉండగా, అందులో 493.54 టన్నులు విదేశాల్లోనే నిల్వ ఉండేది. ఆ తర్వాత దేశీయ నిల్వలను పెంచుకుంటూ వస్తోంది.

పార్కులో ఒంటరిగా కూర్చున్న మహిళకు రూ.2,500 జరిమానా.

- కారణం తెలిస్తే షాకవ్వాల్సిందే..!

న్యూఢిల్లీ
పార్కులో ఒంటరిగా కూర్చుకున్న మహిళ కు అధికారులు రూ.2,500 జరిమానా విధించారు. దాంతో షాకవ్వడం ఆ మహిళ వంతయ్యింది. అధికారుల నిర్ణయం ఆమెకు ఆగ్రహం కూడా తెప్పించింది. ఈ ఘటనపై నెటిజన్‌లు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. జర్మనీ (+వతీఎఘఅఎ) లోని గెల్సెన్‌కిర్చెన్ నగరంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..జర్మనీలోని గెల్సెన్‌కిర్చెన్‌కు చెందిన 31 ఏళ్ల మహిళ హానా తనకు మనసు బాధగా అనిపించడంతో అక్టోబర్ 25న స్థానికంగా ఉండే పార్కుకు వెళ్లింది. ఆ పార్కులో పిల్లలు ఆడుకునే గ్రౌండ్‌లోని బెంచీపై కూర్చుని ఏడ్చింది. ఆ తర్వాత తన అత్తకు ఫోన్ చేసి తన గోడు వెళ్లబోసుకుంది. చదువులు, ఫైనాన్షియల్ సమస్యలతో తాను సతమతమవుతున్నానని, తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని తన అత్తకు చెప్పుకుని భానవోద్వేగానికి లోనయ్యింది. ఏడుస్తూ సదరు



మహిళ అత్తతో తన గోడును వెళ్లబోసుకుంటుండగానే ముగ్గురు మున్సిపల్ అధికారులు ఆమె దగ్గరకు వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న ఆమెతో అధికారులు అక్కడ ఉయ్యాల మీద ఆడుకుంటున్న ఇద్దరు మీ కొడుకులేనా..? అని ప్రశ్నించారు. ఆమె కాదని చెప్పడంతో.. మరి పిల్లల ఆట స్థలంలో ఎందుకు కూర్చున్నారని గట్టిగా అడిగారు. ఇక్కడ కూర్చోకూడదనే విషయం తనకు తెలయదని ఆమె చెప్పడంతో హెచ్చరిక బోర్డును చూపించారు. ఆ బోర్డును తాను గమనించలేదని చెప్పగా రూ.2,500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించిన సదరు మహిళ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధలో ఉన్న తపపై సానుభూతి చూపించాల్సింది పోయి జరిమానా విధించడం ఏమిటని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వార్తపై నెటిజన్‌లు కూడా అసహనం వ్యక్తంచేశారు. బాధలో ఉన్న మహిళపట్ల అధికారులు మానవత్వం ప్రదర్శించాల్సిందని అభిప్రాయపడ్డారు. కానీ అధికారులు మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. పిల్లల రక్షణ కోసం, పిల్లల అపహరణలను అరికట్టడం కోసం తాము ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చామని తెలిపారు. పిల్లలతోపాటు వచ్చే పేరేంట్స్, సంరక్షులకు మాత్రమే ఆ గ్రౌండ్లోని బెంచీలపై కూర్చునే అనుమతి ఉన్నదని, ఒంటరిగా వచ్చే పెద్దలు అక్కడ కూర్చునేందుకు అనుమతి లేదని చెబుతున్నారు. కానీ ఓ మహిళ మాత్రం తాను చాలాసార్లు అక్కడ కూర్చున్నానని, తనకు ఎవరూ జరిమానా విధించలేదని తెలిపారు. ఇదిలావుంటే అధికారులు పిల్లల ఆటస్థలంలోకి ఒంటరిగా వచ్చి కూర్చునే పెద్దవాళ్లకు జరిమానాను మరింత పెంచే యోచనలో ఉన్నట్లు గెల్సెన్‌కిర్చెన్ మున్సిపల్ కౌన్సిల్ అధికారులు వెల్లడించారు.

ఎస్ఏపీలో 10 వేల ఉద్యోగాలకు కోత?

ప్రపంచ సాంకేతిక రంగంలో మరో దిగ్గజ సంస్థ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జర్మనీకి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎస్ఏపీ సుమారు 10 వేల ఉద్యోగాలను తగ్గించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడులను పెంచడం, వ్యాపార కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించడం వంటి లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే దీనిపై సంస్థ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉద్యోగాల తగ్గింపు ఒకేసారి కాకుండా దశలవారీగా చేపట్టే అవకాశం ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఇందులో భాగంగా సహజంగా ఖాళీ అయ్యే ఉద్యోగాలను తిరిగి భర్తీ చేయకపోవడం, స్వచ్ఛందంగా ఉద్యోగాల నుంచి వైదొలిగేందుకు అవకాశాలు కల్పించడం వంటి విధానాలను అనుసరించనున్నట్లు తెలుస్తోంది. ఏయే విభాగాల్లో ఎంతమంది ఉద్యోగులు ప్రభావితమవుతారు? ఏ బృందాల్లో కోతలు



ఉంటాయి? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రపంచవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఉద్యోగులు కలిగిన ఎస్ఏపీ వ్యాపార సంస్థలకు అవసరమైన సాఫ్ట్‌వేర్ సేవలను అందించే ప్రముఖ సంస్థల్లో ఒకటి. ఆర్థిక నిర్వహణ, సరఫరా వ్యవస్థలు, మానవ వనరులు సహా పలు కీలక వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన పరిష్కారాలను అందిస్తోంది. ప్రస్తుతం సాంకేతిక సంస్థలు కృత్రిమ మేధ, స్వయంచాలక సేవలు, మేఘ గణనపై పెట్టుబడులు పెంచుతున్నాయి. ఈ పోటీలో భాగంగా ఎస్ఏపీ కూడా తన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల్లో కృత్రిమ మేధ సదుపాయాలను విస్తరిస్తోంది. మేఘ ఆధారిత సేవలను బలోపేతం చేయడంతో పాటు, కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాల అభివృద్ధిపై సంస్థ దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, భవిష్యత్తులో వృద్ధికి అవకాశాలున్న రంగాలకు వనరులను మళ్లించడం వంటి లక్ష్యాలతో ఉద్యోగాల తగ్గింపు చేపట్టనున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే 10 వేల ఉద్యోగాల కోతపై సంస్థ నుంచి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

బిజినెస్

మళ్లీ పెరిగిన బంగారం ధరలు

- హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలకు రెక్కలు
- 24 క్యారెట్ల పది గ్రాములపై రూ.1,850 పెరుగుదల
- రూ.1,28,400కు చేరిన పది గ్రాముల బంగారం ధర
- 22 క్యారెట్ల పసిడిపై రూ.1,700 పెరుగుదల
- రూ.1,17,700కు చేరిన ఆభరణాల బంగారం ధర
- కిలో వెండిపై ఏకంగా రూ.5,000 పెరుగుదల
- రూ.1.70 లక్షల మార్కును తాకిన వెండి ధర
- ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాల్సిందే



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం మరోసారి గణనీయంగా పెరిగాయి. పసిడి కొనుగోలుదారులకు ధరల పెరుగుదల భారంగా మారింది. తాజా మార్పుల ప్రకారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,850 పెరిగి రూ.1,28,400కు చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,700 పెరిగి రూ.1,17,700 వద్ద కొనసాగుతోంది. మరోవైపు వెండి ధర కూడా భారీగా పెరిగింది. కిలో వెండిపై రూ.5,000 పెరగడంతో ధర రూ.1,70,000 మార్కును తాకింది. బంగారం, వెండి ధరలు ఒకేసారి పెరగడంతో కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరించే పరిస్థితి నెలకొంది. అయితే ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు వెల్లడించాయి. ప్రకటించిన ధరలకు అదనంగా వినియోగదారులు 3 శాతం వస్తు, సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి.

భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- రెండు రోజుల లాభాలకు బ్రేక్.. ప్రధాన సూచీల పతనం
- 989 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 277 పాయింట్లు తగ్గిన నిఫ్టీ
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరిగిన అనిశ్చితి
- చమురు ధరల పెరుగుదలతో మదుపర్లలో ఆందోళన
- భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంధిగ్ధత
- ఐటీ, ప్రైవేటు బ్యాంకింగ్, ఆటో రంగాలపై ఒత్తిడి
- లోహ, రసాయన రంగాల సూచీల్లో మాత్రం లాభాలు



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతుండటం మదుపర్లపై ప్రభావం చూపాయి. దీనికి తోడు భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారుపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్లలో ప్రతికూల వాతావరణాన్ని సృష్టించింది. దీంతో వరుసగా రెండు రోజుల పాటు కొనసాగిన లాభాల పరంపరకు బ్రేక్ పడింది. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 989.33 పాయింట్లు (1.17 శాతం) కోల్పోయి 83,339.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ-50 కూడా 277.30 పాయింట్లు (1.07 శాతం) తగ్గి 25,607.20 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలు, వాణిజ్య చర్చలపై స్పష్టత లేకపోవడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫలితంగా కీలక కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ-50లో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అత్యధికంగా నష్టపోయిన షేర్లలో నిలిచాయి. విస్తృత మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 సూచీ 0.10 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీ 0.56 శాతం లాభపడ్డాయి.రంగాల వారీగా చూస్తే ఐటీ, ప్రైవేటు బ్యాంకింగ్, ఆటోమొబైల్, రియల్టీ, ఆర్థిక సేవల రంగాల సూచీలు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. మరోవైపు నిఫ్టీ మెటల్, నిఫ్టీ కెమికల్ సూచీలు అత్యధికంగా పెరిగాయి. ప్రధాన సూచీలు భారీగా నష్టపోయినప్పటికీ కొన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించడం మార్కెట్‌లో మిశ్రమ పరిస్థితిని ప్రతిబింబించింది. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరలు, వాణిజ్య ఒప్పందాలపై స్పష్టత వచ్చే వరకు మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉందని మదుపర్లు అంచనా వేస్తున్నారు.

అమ్మకానికి బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఆస్తులు

- టెలికాం సంస్థల ఆస్తుల విక్రయంపై కేంద్రం దృష్టి
- రూ.1,300 కోట్ల విలువైన ఆస్తుల నగదీకరణకు ప్రతిపాదనలు
- భవంతులు, భూములు విక్రయించే యోచన
- న్యూఢిల్లీ, ముంబై, ప్రయాగ్‌రాజ్, చెన్నైలో ఆస్తుల గుర్తింపు
- ఇప్పటికే నగదీకరణ ద్వారా రూ.9 వేల కోట్లకు పైగా సమీకరణ
- ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల విక్రయానికి వేగం
- ఎన్ఎల్ఎంసీ ఆధ్వర్యంలో నగదీకరణ ప్రక్రియ
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధుల సమీకరణపై కసరత్తు



న్యూఢిల్లీ,

ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఆస్తుల నగదీకరణపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. తాజాగా ప్రభుత్వ టెలికాం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లకు చెందిన భూములు, భవంతులు, ఇతర ఆస్తులను విక్రయించే యోచనలో ఉంది. ఈ రెండు సంస్థలకు చెందిన సుమారు రూ.1,300 కోట్ల విలువైన ఆస్తుల నగదీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఇప్పటికే పలు ఆస్తులను అమ్మకానికి పెట్టిన కేంద్రం, తాజాగా మరికొన్ని నగరాల్లో ఉన్న ఆస్తులపై దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తుల నగదీకరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.9 వేల కోట్లకు పైగా నిధులను సమీకరించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు చెందిన ఆస్తుల విక్రయ ప్రక్రియను సులభతరం చేసే బాధ్యతను జాతీయ భూముల నగదీకరణ సంస్థ (ఎన్ఎల్ఎంసీ) నిర్వహిస్తోంది. ఈ సంస్థ తన ఆధీనంలోని ఆస్తుల పోర్ట్‌ఫోలియోను కూడా మార్కెట్‌లోకి తీసుకువస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లకు చెందిన న్యూఢిల్లీ, ముంబై, ప్రయాగ్‌రాజ్, చెన్నై నగరాల్లోని ఆస్తులపై అధికారులు దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న భూములు, భవంతుల విలువను నగదుగా మార్చడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవాలని కేంద్రం భావిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల వినియోగాన్ని పెంచడంతోపాటు, విక్రయాల ద్వారా అదనపు నిధులు సమీకరించే దిశగా ఈ చర్యలు చేపడుతోంది.

స్పోర్ట్స్

హిట్ మ్యాన్ రిటర్న్స్..
ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా మళ్లీ రోహిత్ శర్మ

-ముంబై ఇండియన్స్ సారథిగా రోహిత్ శర్మ పునరాగమనం
-ఐపీఎల్ 2027 సీజన్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు
-పంజాబ్ కింగ్స్ జట్టుకు ట్రేడ్ అయిన హార్దిక్ పాండ్యా
-గతంలో రోహిత్ సారథ్యంలోనే ఐదు ట్రోఫీలు గెలిచిన ముంబై
-ప్రధాన కోచ్ పొలార్డ్‌తో కలిసి వ్యూహరచన చేయనున్న రోహిత్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. జట్టుకు గతంలో ఐదు ట్రోఫీలు అందించిన స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మను తిరిగి కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం (నవంబర్ 27) సాయంత్రం 5:45 గంటలకు ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.గతంలో 2024 సీజన్‌కు ముందు రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాకు ముంబై యాజమాన్యం సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే ఇటీవల జరిగిన పరిణామాల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు వెళ్లగా, పంజాబ్ నుంచి ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు ట్రేడ్ అయ్యాడు. హార్దిక్ నిష్క్రమణ అనంతరం సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాల పేర్లు కెప్టెన్సీ కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, ఫ్రాంచైజీ చివరకు అత్యంత అనుభవజ్ఞుడైన రోహిత్ శర్మ వైపే మొగ్గు చూపింది. రోహిత్ శర్మ గతంలో 2013 సీజన్ మధ్య నుంచి 2023 వరకు ముంబై ఇండియన్స్‌కు పూర్తిస్థాయి సారథిగా వ్యవహరించాడు. హిట్ మ్యాన్ నాయకత్వంలోనే ముంబై జట్టు 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన కెప్టెన్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా రోహిత్ కెప్టెన్సీలో ముంబై జట్టు ఫైనల్‌కు చేరిన ప్రతిసారీ ట్రోఫీని ముద్దాడింది. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబై జట్టు మూడేళ్లపాటు ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. 2024 సీజన్‌లో పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచిన ముంబై, 2025లో క్వాలిఫైయర్ 2 వరకు వెళ్లింది. ఇక 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకోవడంతో జట్టు ట్రైటిల్ కరవు ఆరేళ్లకు చేరింది. తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడంపై రోహిత్ శర్మ స్పందిస్తూ, "ముంబై ఇండియన్స్ నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం. ఈ జట్టును నడిపించడాన్ని ఎప్పుడూ ఎంతో గర్వంగా భావిస్తాను. నా 20వ సీజన్ కోసం పూర్తి ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నాను" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసులో ఉన్న రోహిత్ శర్మను, రాబోయే మెగా వేలానికి ముందస్తు వ్యూహంలో భాగంగా ఈ సైకిల్ చివరి సీజన్‌కు సారథిగా నియమించినట్లు తెలుస్తోంది. జట్టులో ప్రధాన ఓపెనర్‌గా కొనసాగుతూనే, ప్రధాన కోచ్ కీరన్ పొలార్డ్‌తో కలిసి 2027 వేలానికి సంబంధించిన ప్రణాళికలను రోహిత్ సిద్ధం చేయనున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ లాంటి పటిష్ఠమైన పేస్ దళం తోడవడంతో, రోహిత్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ తిరిగి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

టెస్టు జట్టులో చోటు దక్కక సిరాజ్ కన్నీళ్లు?..

- లైవ్ కెమెరాలో కనిపించిన భావోద్వేగం!
-సిరాజ్‌ను జట్టులోకి తీసుకోకపోవడంపై టీమ్ మేనేజ్‌మెంట్‌పై మురళీ కార్తీక్ ఆగ్రహం
-డగౌట్‌లో సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడని, కన్నీళ్లు పెట్టుకున్నాడని వ్యాఖ్య
-ప్రాణం పెట్టి ఆడే బౌలర్ సిరాజ్ అని, అతడికి అన్యాయం జరుగుతోందన్న కార్తీక్
-ఫామ్‌లో లేదనుకుంటే అసలు టూర్‌కే ఎందుకు ఎంపిక చేశారని సూటి ప్రశ్న



టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టుకు పక్కన పెట్టడంపై మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. జట్టు యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తప్పుబట్టాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ, సిరాజ్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం లేదని, అతడికి అన్ని ఫార్మాట్లలోనూ తగినన్ని అవకాశాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. మ్యాచ్ సందర్భంగా కెమెరాలు డగౌట్‌లో కూర్చున్న సిరాజ్‌పై దృష్టి సారించాయి. కళ్లజోడు వెనుక తన భావోద్వేగాలను దాచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపించడంతో, అతను కన్నీళ్లు పెట్టుకున్నాడా? అని మురళీ కార్తీక్, అజింక్య రహానే చర్చించుకున్నారు. దీనిపై కార్తీక్ స్పందిస్తూ.. "సిరాజ్ చాలా భావోద్వేగమైన వ్యక్తి. అతడిని చూస్తుంటే బాధలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది" అని వ్యాఖ్యానించాడు. ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించినప్పుడు ఒక్కొక్కరూ ఒక్కోలా స్పందిస్తారని కార్తీక్ తన అనుభవాలను పంచుకున్నాడు. "కొంతమంది ఆటగాళ్లు తమను పక్కనపెట్టినా పెద్దగా పట్టించుకోరు. కానీ సిరాజ్ లాంటి వాళ్లు ఎప్పుడూ ఆడాలనే తపనతో ఉంటారు. ఒంట్లో నొప్పితో బాధపడుతున్నా, జ్వరంతో వణుకుతున్నా సరే, మైదానంలోకి దిగి తమ సర్వస్వాన్ని పణంగా పెడతారు. సిరాజ్ అలాంటి బౌలరే" అని అభిప్రాయపడ్డాడు.

ఆసీస్ క్రికెట్‌ను వెంటాడుతున్న 'శాండ్‌పేపర్ గేట్'..
యాషెస్‌కూ పాకిన వివాదం

-శాండ్‌పేపర్ గేట్ వివాదంపై సీఏ కీలక నిర్ణయం
-దర్యాప్తు పరిధిలోకి 2017-18 యాషెస్ సిరీస్
-ఆటగాళ్ల వాదనల సేకరణకు స్వతంత్ర ఫోరమ్ ఏర్పాటు
-ఖవాజా ఆత్మకథతో మళ్లీ తెరపైకి వచ్చిన బాల్ ట్యాంపరింగ్ వ్యవహారం
-నివేదికను బహిరంగ పరుస్తామని, కొత్తగా శిక్షలు ఉండవని స్పష్టీకరణ

ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఎనిమిదేళ్ల క్రితం పెను ప్రకంపనలు సృష్టించిన 'శాండ్‌పేపర్ గేట్' వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఏర్పాటు చేసిన స్వతంత్ర ఫోరమ్ పరిధిని మరింత విస్తరించింది. 2018 నాటి దక్షిణాఫ్రికా పర్యటనతో పాటు అంతకుముందు జరిగిన 2017-18 యాషెస్ సిరీస్‌లోనూ 'బాల్ మేనేజ్‌మెంట్' పద్ధతులపై దృష్టి సారించనున్నట్లు ప్రకటించింది. ఈ ఫోరమ్ ఇచ్చే నివేదికను, దాని ఆధారంగా తీసుకునే చర్యలను బహిరంగ పరుస్తామని సీఏ హామీ ఇచ్చింది. ఆ యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-0 తేడాతో గెలుచుకుంది. ఆ సిరీస్‌లో ఆసీస్ బౌలర్లు బంతిని నిలకడగా రివర్స్ స్వింగ్ చేయడంపై అప్పట్లో ఇంగ్లండ్ జట్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముఖ్యంగా పెర్త్ టెస్టులో వర్షం కారణంగా మైదానం తడిగా ఉన్నప్పటికీ బంతి రివర్స్ స్వింగ్ అవ్వడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆస్ట్రేలియా బాల్ ట్యాంపరింగ్ చేసి ఉండొచ్చని తాము భావించామని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ అప్పట్లో వ్యాఖ్యానించాడు. ఈ నేపథ్యంలోనే యాషెస్ సిరీస్‌ను కూడా దర్యాప్తు పరిధిలోకి తెచ్చారు. సీనియర్ న్యాయవాది ఫియోనా మెక్లియోడ్ నేతృత్వంలో ఈ ఫోరమ్ పనిచేస్తుంది. ఆటగాళ్లు, కోచ్‌లు, సిబ్బంది స్వచ్ఛందంగా తమ వాదనలను లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా తెలియజేయవచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు. "ఈ ఫోరమ్ ద్వారా ఆటగాళ్లు తమ వాదనలు వినిపించడానికి ఒక సురక్షితమైన అవకాశం లభిస్తుంది. దీని ద్వారా కొత్తగా శిక్షలు విధించడం లేదా పాత గాయాలను రేపడం మా ఉద్దేశం కాదు" అని క్రికెట్ ఆస్ట్రేలియా తాత్కాలిక ఛైర్మన్ డేవిడ్ బూన్ తెలిపాడు. ఇటీవల ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ఈ వివాదాన్ని మళ్లీ తెరపైకి తెచ్చాడు. కేప్ టౌన్ టెస్టులో బాల్ ట్యాంపరింగ్ కుట్ర గురించి జట్టు మొత్తానికీ తెలుసని అతడు పేర్కొన్నాడు. ఈ వాదనకు డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్ మద్దతు పలకగా, ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్, ఇతర బౌలర్లు దీనిని ఖండించారు. ఈ నేపథ్యంలోనే ఆటగాళ్లు తమ వాదనలు వినిపించడానికి ఒక వేదిక కల్పించాలని సీఏ నిర్ణయించింది. కెప్టెన్ కమిన్స్‌కు తమ పూర్తి మద్దతు ఉందని సీఏ ఇప్పటికే స్పష్టం చేసింది. డిసెంబర్ 9 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు ఆస్ట్రేలియా సిద్ధమవుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

RC 17’లో రామ్‌చరణ్ క్యారెక్టర్ అదేనా?



‘ఆర్ఆర్ఆర్’ సినిమా రామ్‌చరణ్‌ని పాన్ ఇండియా స్టార్‌ని చేస్తే.. ‘పుష్ప’ ఫ్రాంచైజీ సుకుమార్‌ని పాన్ ఇండియా డైరెక్టర్‌గా నిలబెట్టింది. ఇటీవలే వీరిద్దరి కాంబినేషన్‌లో ‘=జ 17’ చిత్రానికి కొబ్బరికాయ కొట్టారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ మొదలయ్యాయి. మరీ ముఖ్యంగా ‘రంగస్థలం’ తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్లో రానున్న సినిమా కావడంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాపై ఉన్న అంచనాలు అన్నీఇన్నీ కావు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.అయితే.. షూటింగ్‌కి మాత్రం నెలరోజులపైనే సమయం ఉంది. వచ్చే ఏడాది జనవరి చివరివారంలో గానీ, లేక ఫిబ్రవరి తొలివారంలో గానీ షూటింగ్ ప్రారంభించేందుకు సుకుమార్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని తన పాత్ర కోసం రామ్‌చరణ్ పూర్తిగా కొత్త లుక్‌లోకి మారేందుకు ఇప్పటికే కసరత్తులు మొదలుపెట్టారు. దర్శకుడు సుకుమార్ ఈ సినిమాను పక్కా సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నట్టు టాక్. ఇందులో రామ్‌చరణ్ పాత్రపై ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. మానసిక రుగ్మతతో బాధపడే వ్యక్తిగా ఇందులో రామ్‌చరణ్ కనిపిస్తారట. ప్రారంభం నుంచీ ఆ పాత్రను పాజిటివ్‌గా నడిపిస్తూ.. చివరకు హీరోనే అసలైన విలన్ అని ప్రేక్షకుల్ని నమ్మించేలా స్క్రీన్‌ప్లే రాసుకున్నారట సుకుమార్. హీరోలోనే విలన్ దాగున్నాడనే నిజాన్ని క్లైమాక్స్‌లో రివీల్ చేసే తీరు గూజ్‌బంప్స్ తెప్పిస్తుందని ఇన్‌సైడ్ టాక్. మరి ఇందులో నిజమెంతుందో చూడాలి. ప్రస్తుతం కథానాయికనీ, సంగీత దర్శకుడ్ని ఫైనల్ చేసేపనిలో సుకుమార్ బిజీగా ఉన్నారు. 2028 ద్వితీయార్ధంలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలిసింది. మైత్రీ మూవీమేకర్స్, టీసిరీస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

సినిమాల విషయంలో రూటు మార్చిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్..

ఇకపై వరుస సినిమాలతో బిజీ బిజీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్ మొదటి నుంచి ఆసక్తికరంగానే సాగుతోంది. ‘ఆర్య’ నుంచి ‘అలా వైకుంఠపురములో’ వరకు ఎన్నో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ‘పరుగు’, ‘రేసుగుర్రం’, ‘సరైనోడు’, ‘అల వైకుంఠపురములో’ వంటి సినిమాలతో స్టార్ హీరోగా ఎదిగిన బన్నీ.. ‘పుష్ప’ ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేశారు. అయితే కొన్ని సినిమాలను తక్కువ సమయంలోనే పూర్తి చేసిన ఆయన, మరికొన్ని ప్రాజెక్టుల కోసం మాత్రం చాలా సమయం కేటాయించారు. ముఖ్యంగా ‘పుష్ప’ సిరీస్ కోసం దాదాపు ఆరేళ్ల సమయం వెచ్చించారు. ప్రస్తుతం దర్శకుడు అట్లీతో తెరకెక్కిస్తున్న ‘రాకా’ కూడా భారీ స్థాయిలో రూపొందుతోంది.వరుస సినిమాలకు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల తదుపరి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని అల్లు అర్జున్ భావిస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇకపై తన సినిమాల విషయంలో కొత్త ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక సినిమా పూర్తయిన తర్వాత మరో సినిమా ప్రారంభించడానికి ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా, ముందుగానే కథలు, దర్శకులు, షూటింగ్ షెడ్యూల్స్‌ను సిద్ధం చేసుకోవాలని చూస్తున్నారట. దీంతో వీలైనంత తక్కువ సమయంలో సినిమాలను పూర్తి చేస్తూ అభిమానులకు వరుసగా కొత్త చిత్రాలను అందించాలనేది బన్నీ ఆలోచనగా తెలుస్తోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం అల్లు అర్జున్ తదుపరి ప్రాజెక్టుల గురించి కూడా ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ముఖ్యంగా తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్, మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్‌లతో ఆయన సినిమాలు చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు 2027లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.లోకేష్ కనగరాజ్ తనదైన యాక్షన్ కథలు, విభిన్నమైన స్క్రీన్‌ప్లేతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా, బాసిల్ జోసెఫ్ కూడా తన విభిన్నమైన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అలాంటి ఇద్దరు దర్శకులతో అల్లు అర్జున్ సినిమాలు చేయనున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల విషయంలోనూ నిర్మాణ సమయాన్ని పక్కాగా ప్లాన్ చేసుకుని, అనుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్స్ పూర్తి చేయాలనే ఆలోచనలో బన్నీ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఒకదాని తర్వాత మరొకటి సినిమాలను పట్టాలెక్కిస్తూ తన కెరీర్‌లో మరింత వేగం పెంచాలని చూస్తున్నారట.



ఇది నా మెమొరబుల్ ట్రిప్

షూటింగులకు విరామం ప్రకటించి సాహసయాత్రలో బిజీగా ఉన్నది అందాలభామ కయాదు లోహర్. ఉత్తరాఖండ్‌లోని దయారా బుగ్యాల్ బఖారియా పర్వతపై ట్రెక్కింగ్ చేయడమే కాక, ఏకంగా పన్నెండు వేల అడుగుల ఎత్తుకు చేరుకొని అక్కడ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది కయాదు. ‘నా ట్రెక్కింగ్ జర్నీలో ఇది తొలి శిఖరం. ముందు ముందు మరిన్ని శిఖరాలు అధిరోహించాలనుంది.కెమెరా ముందు నటించడం ఓ విధమైన కిక్ ఇస్తే.. రియల్‌గా అడ్వెంచర్స్ చేయడం మరో విధమైన కిక్ ఇస్తుంది. ఏదేమైనా ఇది నా మెమొరబుల్ ట్రిప్’ అంటూ ఇన్‌స్టాలో పేర్కొన్నది. ప్రస్తుతం తమిళంలో ‘సూర్య 48’ చిత్రంతోపాటు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ‘మంజనాతి’ సినిమా చేస్తూ బిజీగా ఉన్నది కయాదు. అలాగే మలయాళంలోనూ ఓ సినిమా చేస్తున్నదీ అందాలభామ.

ఆసక్తి రేకెత్తిస్తున్న ‘సోనెంటల్’ ట్రైలర్!

‘డార్క్’ మేకర్స్ నుంచి మరో క్రేజీ థ్రిల్లర్..



ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందిన జర్మన్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ‘డార్క్’ సృష్టికర్తలు బారన్ బో ఓడర్, జాంట్జే ఫ్రైస్ మరోసారి ఆసక్తికరమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. వీరి నిర్మాణంలో తెరకెక్కుతున్న కొత్త జర్మన్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ‘సోనెంటల్’. తాజాగా విడుదలైన ఈ సిరీస్ తొలి ప్రచార చిత్రాలు కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ‘డార్క్’లో మార్తా నీల్సన్ పాత్రతో గుర్తింపు తెచ్చుకున్న లిసా వికారి ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సిరీస్‌లో లిసా వికారి ‘అంజా వోగ్లర్’ అనే నేర పరిశోధకురాలిగా కనిపించనున్నారు. తన సొంత ఊరైన సోనెంటల్‌లో జరిగిన ఓ దారుణ హత్య కేసు దర్యాప్తు కోసం ఆమె తిరిగి వస్తుంది. అయితే, ఆ హత్యల వెనుక ఒక నిర్దిష్టమైన భయంకరమైన క్రమం ఉందని గుర్తిస్తుంది. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ఆ హత్యలకు 19వ శతాబ్దానికి చెందిన జర్మన్ బాలల పుస్తకం ‘స్ట్రువెల్‌పీటర్’లోని భయానక కథలతో సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది. 1845లో ప్రచురితమైన ఈ పుస్తకంలోని కథలను ఆధారంగా చేసుకుని హంతకుడు వరుస హత్యలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో బయటపడుతుంది. చిన్నారులను భయపెట్టేందుకు రాసిన కథలు నిజ జీవితంలో హత్యలకు ఎలా కారణమయ్యాయి? హంతకుడు ఆ కథలను ఏ విధంగా అనుసరిస్తున్నాడు? వాటి వెనుక దాగి ఉన్న రహస్యాన్ని అంజా వోగ్లర్ ఎలా ఛేదిస్తుంది? అనే అంశాలు సిరీస్‌లో ఉత్కంఠను పెంచనున్నాయి. మొత్తం ఆరు భాగాలతో ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. 2027 మార్చిలో హెచ్‌బీఓ మ్యాక్స్ వేదికగా అన్ని భాగాలను ఒకేసారి ప్రసారం చేయనున్నట్లు సమాచారం. ‘డార్క్’తో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సృష్టికర్తలు మరోసారి మిస్టరీ, నేర పరిశోధనల నేపథ్యంలో కథను తీసుకురావడంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

14 ఏళ్ల నాగార్జున రికార్డుకు ఎసరు..

ధమరుకం’కి చేరువలో తరుణ్ భాస్కర్, దుల్కర్ సినిమాలు!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఇప్పుడు ఒక ఆసక్తికరమైన రికార్డు వేట కొనసాగుతోంది. అక్కినేని నాగార్జున హీరోగా నటించిన ‘ధమరుకం’ సినిమా నవంబర్ నెలలో నెలకొల్పిన అత్యధిక వసూళ్ల రికార్డుకు 14 ఏళ్ల తర్వాత గట్టి పోటీ ఎదురవుతోంది. శ్రీనివాస రెడ్డి దర్శకత్వంలో, అనుష్క కథానాయికగా 2012 నవంబర్ 23న విడుదలైన ‘ధమరుకం’ ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 48 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, నవంబర్ నెలలో విడుదలైన తెలుగు చిత్రాల్లో ఆల్‌టైమ్ రికార్డును సృష్టించింది. అయితే దశాబ్ద కాలానికి పైగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డును ఇప్పుడు రెండు కొత్త తెలుగు సినిమాలు అధిగమించే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి.తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కి, నవంబర్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘ఈ నగరానికి ఏమైంది 2’ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. ఈ చిత్రం విడుదలైన ఏడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 45 కోట్ల గ్రాస్ సాధించినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. ‘ధమరుకం’ రికార్డును బద్దలు కొట్టడానికి ఈ సినిమాకు మరో రూ. 3 కోట్ల వసూళ్లు మాత్రమే అవసరం కావడంతో, ఈ వారంలోనే ఆ మైలురాయిని దాటడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, దుల్కర్ సల్మాన్ నటించిన ‘ఆకాశంలో ఒక తార’ చిత్రం కూడా నవంబర్ 20న విడుదలై బాక్సాఫీస్ వద్ద తన జోరును ప్రదర్శిస్తోంది. కేవలం ఆరు రోజుల్లోనే సుమారు రూ. 37 కోట్ల గ్రాస్ వసూలు చేసిన ఈ చిత్రం, ఈ వీకెండ్‌లో వచ్చే వసూళ్లతో రూ. 48 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేవలం ఒక్క రోజు వ్యవధిలో విడుదలైన ఈ రెండు చిత్రాల్లో ఏది ముందుగా నాగార్జున రికార్డును అధిగమిస్తుందోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ప్రతీ మహిళా చూడాల్సిన చిత్రం

సామాజిక సంస్కరణల కోసం కృషి చేసిన మహానీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత కథ ఆధారంగా హిందీలో రూపొందించిన ‘పూలే’ చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఆ సినిమా తెలుగు వెర్షన్ నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. అనంత్ నారాయణ్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డా॥ పాన్నం రవిచంద్ర నిర్మించారు. ఏషియన్ సినిమాస్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ప్రతీక్‌గాంధీ, పత్రలేఖ ప్రధాన పాత్రల్లో నటించారు. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు.ప్రతీ మహిళా తప్పకుండా చూడాల్సిన చిత్రమిదని, ప్రజల్లో స్ఫూర్తిని కలిగించే గొప్ప చిత్రమిదని నిర్మాత డా॥ పాన్నం రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్‌గాంధీ, తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465